# 41

# 'గాజు పెంకుల నడుమ బూజు బతుకును చూడు'

**"ఆ** పిల్లకు 'సుభాషిణి' అన్నపేరు పెడుతున్నప్పుడు ఉత్తరోత్తరా ఆ అమ్మాయి మూగదవుతుందని ఆమె తల్లిదండ్రులకు తెలియదు." అంటూ రవీంద్రుడొక కథను ప్రారంభించాడు.

సరిగ్గా ఈ వాక్యాలు మన 'ముత్యాలు'క్కూడా వర్తిస్తాయి. పదమూడేళ్ళ కిందట, అతని పేరు పెడుతున్నప్పుడు, నాగయ్యగానీ, అదెమ్మగానీ తమకొడుకు బతుకింత అధ్వాన్నంగా ఉంటుందని ఊహించి ఉండరు.

నాగయ్యది గుంటూరు జిల్లాలోని గురజాల దగ్గరున్న చిన్న పల్లెటూరు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కడుతున్నప్పుడు నాగయ్య రాళ్ళు మోసే కూలీగా చేరాడు. రోజుకు నాలుగు, ఐదు సంపాదించ ఎకునేవాడు. కుడిగట్టున చిన్నపాక వేసుకుని అక్కడే నాలుగేళ్ల కాలక్షేపం చేశాడు. ఆ ప్రాజెక్టుతో అక్కడి రాళ్ళతో, ఆ మట్టితో, ఆ గాలితో, ఆ రొదలతో నాగయ్య కలిసిపోయాడు.

"అప్పుడే వీడు నా కడుపున పడ్డాడయ్యా!" అన్నది ఆదెమ్మ.

ఆమె మాటల్లో చెప్పాలంటే నాగయ్య మంచివాడు. కష్టజీవి. భార్యను ఆప్యాయంగా చూసుకునేవాడు. పెళ్ళాం పనిచేస్తానన్నా వద్దనే వాడు. కానీ అదెమ్మ ఊరికే కుచునేది కాదు. సున్నం గానుగల దగ్గర పనిచేసేది. గులకరాళ్ళు, సిమెంటు, ఇసుక మిక్చర్‌తో పోసేది. తనూ, అంతో ఇంతో సంపాదించేది అప్పుడప్పుడు ఇద్దరూ 'ఓటి' చేసేవారు. అలా చేసినందుకు మరో నాలుగు డబ్బులొచ్చేవి. వారానికో పది రోజులకో మాచెర్లదాకా వెళ్ళి సినిమా చూసొచ్చేవారు.

"ఆయన తాగుడు, నీచూ ముట్టుకోడు. ఎప్పుడన్నా 'పులిజూదం' మాత్రం ఆడేవాడు" అన్నది ఆదెమ్మ కళ్ళొత్తుకుంటూ.

ఎండ సెగలెగసి పోతున్నది. రేపో ఎల్లుండో మంత్రిగారెవరో ప్రాజెక్టు చూడ్డానికొస్తున్నారట. గబగబా పనులు పూర్తి చేయాలిట. బసవయ్యగారు హడావుడిగా వున్నారు. ఆయనగారి పని - ఇంకా కురదలా పడిపోయింది. అందుకని రాత్రింబవళ్ళు దగ్గర నిలబడి పనిచేయిస్తున్నాడు. తనక్కూడా మిక్చర్ దగ్గర ఊపిరాడనంతగా వుంది. సిమెంటు ఇసకా, కలిసిందో లేదో చూడకుండానే బొచ్చెల్లోకి పంపేయమంటున్నారు బసవయ్యగారు. ఓ నిమిషం ఊపిరితీసుకునే వ్యవధి కూడా లేదు.

అప్పుడే ఆదరాబాదరా జంగయ్య వచ్చాడు. వచ్చి- అసలు సంగతిని కాస్తా చెప్పలేక చెప్పేశాడు. బసవయ్య ధర్మరాజు లాంటివాడు గనక వందరూపాయలిచ్చి చప్పున పంపించేశాడు ఆదెమ్మను.

జరిగిందేమిటంటే-

రాత్రి పొద్దుపోయిందాకా, రాళ్ళు మోసిన నాగయ్యను మళ్ళీ తెల్లవారుజామునే మేస్త్రీ పనిలోకి తీసుకుపోయాడు నాగయ్య- అక్కడికి రాలేననే అన్నాడు. కానీ, మంత్రిగారు వస్తున్నారు. గుత్తదారు పనిని పూర్తి చేయాలనుకుంటున్నాడని, ఇప్పుడు గనక పనిలోకి రాకపోతే చర్మం వలిచేస్తారని మేస్త్రీ అన్నాడు. 'రూపాయికి రూపాయి ఎక్స్ట్రా' అని ఆశ చూపించాడు. నాగయ్య లేచి తలగుడ్డ చుట్టుకొని వెళ్ళాడు.

"అదే ఆఖరు చూపవుద్దని అనుకోలేదు దేవుడా!" అని ఏడ్చింది ఆదెమ్మ.

అసులుసులుగా వున్న అడితీలమీదుగా రాళ్ళు తీసుకెడుతున్నప్పుడు సర్వీకడ్డీ విరిగి అడితి కూలిపోయింది. అడితిమీద అప్పటికున్న ఆరుగురు కూలీలూ కిందికి రాలిపోయారు. అంతెత్తునుండి పడుతున్నప్పుడు వారు చేసిన ఆర్తనాదాలు, యంత్రాల రణగొణధ్వనుల్లో కలిసిపోయాయి.

“ఇక్కడ బతుకుదామని వచ్చానయ్యా. నాలుగిళ్లలో అంట్లుతోముతా... మా అత్త మాకాడనే ఉంటున్నది. బిడ్డ చేతికి అక్కరకొచ్చాడు” అన్నది ఆదెమ్మ కొడుకు తలను ఆప్యాయంగా నిమురుతూ.

ముత్యాలుకు మొదట మొదట ఈ పట్నం వాసన పడలేదట. అందరూ ‘గమార్’ అనేవారట. తల్లి కొంగు పట్టుకొని ఇల్లిల్లూ తిరుగుతుండేవాడట. తనకు ‘బాస’కూడా సరిగా వచ్చేది కాదట. ఇప్పుడయితే జమాయించి మాట్లాడతానన్నాడు ముత్యాలు.

“నాకు సదువురాదు. మరేమో అమ్మే- నన్నే - బల్లోకి పంపియ్యదుగా” అన్నాడు ముత్యాలు.

తన ఈడు వాళ్లతో గాలి తిరుగుడుతిరుగుతున్నప్పుడే - వాడికీ గాజు పెంకులేరుకోవడం అలవాటయింది. ఎవరికీ పనికిరాక పారేసిన తుక్కులోంచి ముత్యాలు తన బతుకును పోగు చేసుకుంటున్నాడు.

పగిలిన సీసాపెంకులు, ప్లాస్టిక్ తుంపులు, ఇనపబందులు, మేకులు, పుస్తకాల అట్టలు, వాడేసిన బ్లేళ్ళు, ఊలుముక్కలు, రిబ్బనుతుంపులు, కలం గొట్టాలు, కళ్ళజోడు ఫ్రేములు, తుక్కు కాగితాలు, పాల సీసాల మీద మూతలు, ముత్యాలుకు పనికి వస్తాయి. ఇవన్నీ వాడు ఏరతాడు. ఇంటికి తెస్తాడు. వాళ్ల నాయమనమ్మ వాటిని శుభ్రం చేస్తుంది. బాగా పోగయ్యాక వాటిని అమ్ముకుంటారు.

అయితే ఈ తుక్కు సరుకైనా అన్ని చెత్త కుప్పల్లోనూ దొరకవన్నాడు ముత్యాలు. ఒక్కోసారి పైపైనే దొరకుతాయట. కొన్నిసార్లు ‘వొగ్గె’పెట్టి కెలికి కెలికి చూస్తేగాని దొరకవుట.

“ఒక్కోపాలి- ఎంత కెలికినా దొరకవుగా!” అన్నాడు ముత్యాలు. వీటన్నిటికంటే సీసా పెంకుల బిజినెస్ బాగా వున్నదన్నాడు ముత్యాలు. ఈ పెంకుల్లోనూ మళ్ళీ అన్ని రకాలు పనికిరావుట. తెల్లసీసాపెంకులు కిలో 15 పైసలకు కొంటారుట. కాఫీరంగు సీసాపెంకులకయితే ఇంకో 5 పైసలు అదనంగా ఇస్తారట. ప్లాస్టిక్ బూరలు, దువ్వెనలు, మూతలు, నాలికబద్దలు, పర్సులు, డబ్బాలు, బరిణెలు, సంచులకయితే కిలో రూపాయి దాకా పలుకుతుందిట.

“పొద్దున్నే సద్దన్నం తింటానూ, మరే తిన్న తరువాతనేమో వొగ్గె తీసుకొని, సంచి బుజానికేసుకుని బజార్లంబడి పడతా - మధ్యాన్నం దాకా తిరుగుతూ - కాసేపు కూసుంటా. మల్లా మాపిటాలదాకా తిరుగుతా... మా అమ్మే రోజు 10 పైసలిస్తందిగా అది బెట్టి తిమ్మిరిబిళ్ళ కొనుక్కుతింటా” అన్నాడు ముత్యాలు.

అంతర్జాతీయ బాలల సంవత్సరాన్ని గురించిగానీ, ఐక్యరాజ్యసమితి బాలలకు ప్రసాదించిన హక్కుల్ని గురించిగానీ ముత్యాలుకు తెలియదు. మన పార్లమెంటు, మన శాసనసభ, వివిధ న్యాయస్థానాలు బాలల సంక్షేమాన్నిగురించి చెప్పినవేవీ ముత్యాలు దాకా ఇంకా రాలేదు.

తిరకాసు ఎక్కడుందో ఏమిటో తెలీడంలేదు గానీ, మనకెప్పుడో సోషలిజం తెస్తామన్నారు ఏలినవారు. అదేదో అప్పుడే తెచ్చినట్లయితే, ముత్యాలు సామ్యవాద దేశంలో పుట్టివుండేవాడు.

హాయిగా, కలిగిన వారి బిడ్డలు చదువుకుంటున్నట్లు వాడూ చదువుకునేవాడు. మరి - మనవారేమో దాందుంప తెగిన సోషలిజం- దాన్ని తీసుకురాలేకపోతున్నారు. మన వాళ్ళ చిత్తశుద్ధిని శంకించి మనల్ని మనమే అవహేళన చేసుకోవడం భావ్యంకాని మాట నిజమే! ఒకవేళ మనవారు చిత్తశుద్ధిగా కృషి చేసినా మన మీద కోపంకొద్దీ ఆ సోషలిజమే మనదాకా రానంటున్నదేమో కూడా మనకు తెలీదు. ఆ సమసమాజమో, చట్టుబండలో తొందరగా రావాలి. అలా వస్తే తప్ప - ముత్యాల్లాంటి లక్షలాది పసిబిడ్డల బతుకులు, ఈ గాజుముక్కల్లోంచి, బూజుగుడిసెల్లోంచి బయటపడవు.